మలయమారుతం - ఝంప

ఇదిగాక సౌభాగ్య - మిదిగాక తపము మరి
యిదిగాక వైభవం - బికనొకటి గలదా

అతివ జన్మము సఫల - మై పరమ యోగివలె
నితర మోహాపేక్ష - లిన్నియును విడచె
సతికోరికలు మహా - శాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వా - సనవోలె నుండె

తరుణి హృదయము కృ - తార్థత బొంది విభుమీది
పరవశానంద సం - పదకు నిరవాయె
సరసిజాసన మనో - జయమంది యింతలో
సరిలేక మనసు ని - శ్చల భావమాయె

శ్రీ వేంకటేశ్వరుని - జింతించి పరతత్వ
భావంబు నిజముగా - బట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపా - ధీనురాలై యిపుడు
లావణ్యవతికి ను - ల్లంబు తిరమాయె

అన్నమాచార్యులు అద్భుత సౌందర్యలహరులుగా వెలయించిన సంకీర్తనలు ఎన్నో పరమానందసిద్ధి పొందిన పరమయోగిలో శృంగార నాయికనూ, ఆ నాయికలో యోగినీ పరస్పరం ఆపాదించి, వారుభయులకూ అభేదమేర్పరచి, శ్రీయోగ విద్యాతంత్రపరంగా, శృంగార వేదాంతాలని పరాకాష్టకు చేర్చిన ఈ ప్రక్రియ ఆంధ్ర సాహిత్యంలోనే కాదు మరే భాషా సాహిత్యంలోనూ లేదనడం స్వభావోక్తియే.

నాయిక అలమేల్మంగ శ్రీ వేంకటపతితో రతికేళిని చొక్కి వివశయై ఉన్నది. ఆమె జన్మ సఫలమై పరమయోగివలె, ఇతర మోహాపేక్షలన్నీ త్యజించినది. శ్రీవిద్యాపరంగా యిక్కడ త్రైలోక్య మోహన చక్రం. ప్రధమావరణం శృంగారరసం, మూలాధారచక్ర ప్రకృతీ సూచితం. ఆమెకోరికలు అన్నీ తీరి శాంతించినవి. (సర్వాశా పరిపూరక చక్రం సూచితం). ఆ శాంతస్థితి సతతమైన విజ్ఞాన వాసనవలె ఉన్నదట. 'ఈశ్వరానుగ్రహాత్ పుంసామద్వైత వాసనా ' జ్ఞానాదేవతు కైవల్యం అన్నవి పప్రూణ వాక్యాలు. చిచ్ఛక్తి అజ్ఞాన తిమిరాన్ని

తొలగించే దీపం గనుక ఇక్కడ స్వాధిష్ఠాన చక్రం సూచితం.

తరుణి హృదయము కృతార్థత పొందినది. విభునిమీది పరవశానంద సంపదకు ఆమె యెద భాండారమైనది. లక్ష్మీ హృదయంలో విష్ణునియెడ పరవశానంద సంపద ఉండడం ధర్మం. ఆమె ప్రకృతి. ఆయన పురుషోత్తముడు.లక్ష్మీ హృదయవాసి శ్రీనివాసుడు. శ్రీవిష్ణు హృత్కమలవాసిని విశ్వమాత. ఇక్కడ 'హృదయం'లో అనాహత చక్రం సూచితం. పరవశానంద సంపద అన్నపుడు విశుద్ధ చక్ర సూచన.

సరసిజానన మనో జయమందినది. ఆమె జిత మనోవస్థ ఉపమించరాని దైనంతలో కేంద్రీకృత శ్రీవేంకటేశ్వరైక భావనమై మనసు నిశ్చలమైనది. సరసిజానన మనోజయమందినది అనడంలో గూడార్థం ఉన్నది.  మనస్తత్వం గలది ఆజ్ఞా చక్రాన్ని దాటితే సహస్రదళ కమలం యోగులకు కన్పట్టుతుంది. ఆ సహస్రదళ పద్మంలో లక్ష్మీనారాయణులు విహరిస్తూ ఉంటారు. తత్కమల దర్శనం సిద్ధించిన వారికి  సహస్రదళ కమలో పరివాసియైన చంద్రుడు (మామూలు చంద్రునికన్న అన్యుడు) నిత్య అనే కళ గలిగి సాధకులపై బిందువు బిందువుగా అమృతాన్ని చిలికిస్తాడట. తత్సహస్రార పద్మ దర్శనాన్ని సూచించడానికి 'సరసిజానన' అన్నారు అన్నమాచార్యులు. (త్యాగరాజస్వామి ఎందరో మహానుభావులు కీర్తనలో 'చందురు వర్ణుని అందచందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించువా' రన్నప్పుడు ఇదే అర్థం. శ్రీరాముడు చందురు వర్ణుడు కాడుగదా మరి) ఆ సుధాబిందు నిష్యంద ప్రాప్తియే బ్రహ్మానంద సిద్ధియని సమయాచార తత్పరజనులూ పాతంజలీత్యాది యోగివరేణ్యులూ ఉద్వచించారు.

ఆమె నిర్మోహ, నిష్కామ నిష్కలంక నిరంజన నిర్వికల్ప నిరంతరర స్థితిలో - శ్రీవేంకటేశ్వరుని నిశ్చలైక భావంతో చింతిం చినందున

పరతత్త్వభావమును సొంతం చేసుకున్నది చెలి యాత్మ. (ఇందుకు ప్రమాణం హంస మంత్రం. 'హంనిశ్శివస్సోహం, సోహం, హంసశ్శివః' అని. తానే ఆ స్వామిలో ఒదిగి ఆయన కృపాధీనురాలైనది. ఆయన కృపయే తానైనదని ధ్వని. అప్పుడు కడు చంచలయైన లక్ష్మీ లావణ్యవతికి చాంచల్యం పోయి స్థిరమైన శ్రీ వేంకటేశ్వర దయాకారయై ఆమె తన సర్వస్వాన్నీ స్వామికి అర్పణం చేసిన త్యాగగుణం వల్ల అమృత తత్వాన్ని పొందినది. 'త్యాగే నైకేన అమృతత్వ మానశుః' అని శ్రుతి వాక్యం (త్యాగం వల్ల మాత్రమే అమృతత్వం కలుగగలదు). ఈ సంకీర్తనలోని శ్రీవిద్యా విషయానికి ఆధారం శ్రీమచ్ఛంకరుల సౌందర్య లహరిలోని 9వ శ్లోకం.

మహీం మూలాధారే కమపి మణి పూరే హుతవహం

స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశము పరి
మనోపి భ్రూ మధ్యే సకలనుపి భిత్వాకుల పధం
సహస్రారే రమ్యే సహరహసి పత్యా విహరసే

శ్లోకతాత్పర్యమిది - ఓ శ్రీదేవీ మూలాధార చక్రంలో భూమి తత్వాన్ని, మణిపూర చక్రం ఉదకాన్ని, స్వాధిష్ఠాన చక్రంలో అగ్నితత్వాన్ని, అనాహత చక్రంలో వాయు తత్వాన్ని, ఆజ్ఞా చక్రంలో మనస్తత్వాన్ని, ఈ కులపధ సకలమునూ అధిగమించి, (ఛేదించి) నీవు సహస్రదళపద్మంలో పతితోగూడ నిత్యవిహారము చేస్తుంటావు. మరి ఇంతకన్న సౌభాగ్యం, ఇంతకంటే తపము, ఇంతకన్న వైభవం మరెక్కడైనా కలవా? లేవు. భాగ్యంలో తపంలో వైభవంలో యిదే మలిమాట.

శంకరాచార్యులే అన్నమాచార్యులన్న భావం, నమ్మిక ఈ సంకీర్తన అమృతమును మథించేవారికి కలుగుతుంది.

ఈ సంకీర్తనకు ఈ వ్యాఖ్య చాలదు. వలసినవారు దర్శించవలసిన గ్రంధాలు.

1. శ్రీమచ్ఛంకరుల సౌందర్యలహరి (లొల్ల లక్ష్మీధర దేశికుల లక్ష్మీధర వ్యాఖ్యతో). 33 నుండి 7 శ్లోకాలు ప్రత్యేకంగా.
2. ముత్తుస్వామి దీక్షితుల నవావరణ కీర్తనలు.
3. వేదాంత దేశికుల దయా శతకము.

ఈ కీర్తన అలమేల్మంగా శృంగారలక్ష్మీహృదయ మన్త్రం ఋషి మంత్రస్రష్ట అన్నమా చార్యులు. ఖండగతి పదకవిత ఛందం శ్రీవేంకటేశ్వరుడు అధిష్ఠానదేవత. మధుర భక్తి బీజం. సరస వక్రోక్తి కీలకం. ఆధ్యాత్మిక శృంగార విజ్ఞాన పరిపాకం శక్తి. అలమేల్మంగా స హిత శ్రీవేంకటేశ్వర ప్రసాద రూప రససామ్రాజ్య ప్రాప్త్య ర్థం జపము వినియోగం. గానా భినయ తాళద్రుత కరణాలు అంగన్యాస కరన్యాసాలు. అన్నమాచార్య పదగానప్రియ హరి పదకమలకాంతి ధ్యానం, ధాతుమాతు పునరావృత్తియే పునశ్చరణ.